


ముష్టి తాత జ్ఞాని కాదు. వేదాంతి అంత కంటే కాదు. ఇరవై ఏండ్ల క్రితం తల వెంట్రుకలు పూర్తిగా నెరసిపోయి, శరీరం ముడతలమయంగా నిలిచి, జీవితం బరువుగా మారిపోయినపుడు, అరవై యేండ్ల వయసుని ఆయాసంతో మోసుకుంటూ సిమ్మాచెలం కొండ మీద చేరాడు ముష్టితాత. స్వామి వారి ఆలయానికి దూరంగా, మూడొందల మెట్ల పొడవాటి రస్తాలో అతడి కంటే ముందుగా మకాం వేసిన మిగతా బిచ్చగాళ్ళంతా అతను రావడం చూసి మొదట్లో చికాకు కనబరిచారు. తర్వాత్తర్వాత అతడి తత్వం పూర్తిగా ఆకళింపు చేసుకొన్న మీదట, అసలు పేరేదో రాబట్టలేక పోయి, చివరికి ముష్టి తాతగా నామకరణం చేసేశారు. అది అతడికి షష్టిపూర్తి కాదు. ఆ జాతికి చెందిన మరే ఉత్సవమూ కాదు. అతనికది మరో కొత్త జన్మ, మరో కొత్త పేరు.

తమ జన సంఖ్యలో పెరిగిన మరో నవ్యజీవి తాలూకు వివరాలూ గట్రా విచారించే ప్రయత్నంలో

# దేవుడు చావకూడదు



చిరంజీవి

జీవితాల్లాగే వెనకబడిన జాతికి చెంది పోయారు - బిచ్చగాళ్ళంతా. పదే పదే తరచి, తరచి ప్రశ్నించి, ప్రాణాలని ముక్కు కొస మీదికి లాక్కువొచ్చినపుడు గత్యంతరం కనిపించక తనకో అడ్రసంటూ లేదనీ, ప్రతి చెట్టు నీడా తన యిల్లేననీ, సాదరంగా విన్నవించుకొన్నాడు ముష్టి తాత. నిజమే...నిలవను నీడలేని వాడికి పుట్టిన గడ్డా, పెరిగిన ఊరూ ఎక్కడుంటాయని? అంచేత అందరూ అతని మాటలు తేలిగ్గా నమ్మేశారు. ఓటు హక్కుకి నోచుకోని తమ సంఘంలో, ముష్టితాతకో స్థానం కేటాయించబడింది. ఆరోజు లగాయితు, ఈనాటి వరకూ అతడు సిమ్మాచెలం కొండని విడిచి పెట్ట లేదు.

ఉదయం లేచిన దగ్గర్నుంచి, చీకటి వేళ స్వామి వారి ఆలయం సింహద్వారాలు మూసివేసిందాకా రాదారి మెట్ల దగ్గిరే కూర్చునేవాడు ముష్టితాత. ఆదాయం మాట అటుంచి, కాలే కడుపులో పూటకో పిడికెడు మెతుకులు నింపడానికి సరిపడ గ్రాసానికి కొరత లేకుం

డానే గడిచి పోయిందిన్నాళ్ళుగా. ఎటొచ్చీ కోరికలు చచ్చి, జావ తునిగిన వయసు కావడం చేత కొండకు మూడుమైళ్ళ దూరాన వెలసిన పట్నం మీద మనసు విరిగింది. అంత దూరం నడిచే సత్తువ లేకపోవడం వొక వైపూ, పడి లేస్తూ వొకవేళ అక్కడికి చేరుకున్నా, తన కొరకు వీరీక్షించే వాళ్ళు అక్కడెవరూ లేని కారణం మరోవైపూ, అతడి హృదయంలో వొకకొంత విరక్తిని కలిగించిన మాట వాస్తవమే. అది అలాపెచ్చు పెరిగిపోయి, అతను కొండమీది పాడుబడ్డ మంటపంలో రాత్రిళ్ళు గడిపే ప్రయత్నానికి పకడ్బందీగా పనిచేసింది. కాలచక్రాన్ని అధిగమించలేని ఋతువులతో పాటు, ఆ మంటపంలోనే కాలానికి బానిసగా రోజులు గడపడానికి అలవాటు పడిపోయాడు ముష్టితాత.

కాలం మారింది—

వచ్చే-పొయ్యే జనం మారిపోయారు. బ్రతుకు దెస మారింది. అన్నింటినీ మించి స్వామి వారి కొండకున్న పలుకుబడి మారింది. అయినా దాన-ధర్మాలకి కొరతంటూ యేర్పడలేదు. ఇరవైయేండ్లనాటి విశ్వాసం, భక్తిప్రపత్తి యిప్పుడు లేకపోయినా, దైవదర్శనానికి వచ్చే జన సందోహం మాత్రం తగ్గలేదు. ఆ రోజుల్లో సాయింకాలానికి రెండు రూపాయల దాక సంపాయించే ముష్టితాత, ఇప్పటికీ రెండు రూపాయలు యెటు తిరిగి సంపాయిస్తూనే వున్నాడు. అయితే అప్పుడు దానితో మూడు పూటలు తినగలిగేవాడు. ఇప్పుడు వొకటిన్నర పూట గడవటమే కష్టంగా వుంది.

ఇక్కడో విషయం చెప్పుకోవాలి. కూరగాయలు, పండ్లు - ఫలాలు, కూలి పనుల్లాగే పుణ్య తీర్థాలకి కూడ ఓ సీజనంటూ యేర్పడి పోయింది. గ్రీష్మంలో పుచ్చకాయలు అసంఖ్యాకంగా బజార్లోకి వొచ్చే విధంగా, అదే రోజుల్లోనే తీర్థ యాత్రలకి టూరిస్టు బస్సులు కూడా బైల్దేరు తుంటాయి. [ఆ మాటకొస్తే భక్తి కలగడం అన్నదికూడా సీజన్‌కి సంబంధించిన విషయమే కదా!] మిగతారోజుల్లో జనం ఇసుక వేస్తే రాలడం అటుంచి వేసింది వేసినట్టుగానే నేల రాలిపోయేటంత పల్చగా ఉంటారు. కొన్ని వేళల్లో ఆ జనమూ లేకపోవడం వింత మాత్రం కాదు.

అదే జరిగింది కూడా. ఆరోజు

ఉదయం మొదలుకొని సాయంత్రం సూర్యుడు చీకట్లో కలిసిపోయే నంత వరకూ పట్టుమని పదిమంది జనం కూడా కొండనెక్కలేదు. వచ్చిన వాళ్ళు వచ్చినట్టుగానే దిగి పోయారు. ముష్టితాత ముందున్న పాత్రలో అర్ధరూపాయి చిల్లర మాత్రం పడింది. దాంతో పిడికెడు శెనగలు కొని, బాల్చెడు నీళ్ళు తాగి మంటపం చేరుకొన్నాడు. తిత్తిలో చేరిన నీళ్ళు బరువుగా అడుగులు వేసినపుడు మెల్లగా శబ్దం చేశాయి. అవి కాస్త పైకి ప్రాకి బొట్లు బొట్లుగా కళ్ళలోంచి జారి కింద పడ్డాయి.

ఆ రాత్రంతా ముష్టితాతకు కంటి మీద కునుకు లేదు. ఆలోచన్లు చీకట్లో తామరతంపరగా మేల్కొన్నాయి. స్వార్థాన్ని గురించి ఆలోచించలేదు. ఆ పూట కేవలం నీళ్ళతో నిండిన కడుపు గూర్చి విచారించలేదు. అతను ఆలోచించిందంతా కుంటిపిల్ల ముత్యాలుని గురించే. సంధ్యాకాంతులు ముసురు

---

## రచయితలకు మనవి

'విజయ' లో ప్రచురణార్థం పంపే కథలు, నవలలు, కార్టూన్స్, జోక్స్, వ్యాసాలు—ఏవైనా సరే ప్రచురణార్హం కాని వాటిని త్రిప్పి పంపగోరువారు, తగినంత పోస్టేజీ అంటించిన కవర్లను జత చేయవలసిందిగా కోరుతున్నాం. అప్పుడే నిరాకరించిన వాటిని త్రిప్పి పంపటం జరుగుతుంది. ఆ తర్వాత ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ప్రయోజన ముండదు. 'బాపు అభిమానుల పేజీ' లో పాల్గొనే పాఠకులు, తమ సంభాషణలను కార్డుమీద వ్రాసి పంపితే చాలు.

—ఎడిటర్

రచనలు పంపవలసిన చిరునామా:

ఎడిటర్

'విజయ'

80- ధనలక్ష్మికాలనీ,

మద్రాసు-600 026

కొచ్చిన వేళ, నిర్జీవంగా మెదలిన చిరునవ్వుని పెదవులమీద రాసుకొని చంకలోని ఊతకర్రని మరింత బలంగా అదిమి పట్టుకొంటూ, ముష్టితాత వైపు బిక్కు బిక్కుగా చూస్తూ వెళ్ళిందా పిల్ల. కొండ దిగితే కుంటుతూ మూడుమైళ్ళు నడవాలి. రాత్రికి గంజి నీళ్ళకైనా తృణమో - పణమో పట్టుకొస్తుం దన్న ఆశతో ఎదురుచూసే తల్లికీ, చెల్లెళ్ళకీ మొహం చూపాలి.

"తాతా! ఇవ్వాళ గుడికి జనమే రాలేదు-ఎందుకంటావు?" అంటూ ప్రశ్నించింది వెళ్తూ, వెళ్తూ.

ఏం జవాబు చెప్పగలడు తను? కారణం కొండమీద వెలసిన సిమ్మాద్రికే తెలుసు. రోజూ వచ్చే భక్తకోటి ఉప్పెనలో కొట్టుకు పోయినట్టు వొక్కరూ రాక పోవడంలో దాగిన రహస్యం అత డికి తప్పితే మరెవరికి తెలుసు? అందుకే భారాన్నంతా దేవుడిమీదికే నెడుతూ జవాబిచ్చాడు___

"ఎందుకు రాలేదో వాడికే తెలుసు, తల్లీ! వాడు కోరుకుంటే ప్రపంచాన్నే రప్పించుకో గలడు. ఎందుచేతనో వాడికి దయకలగ లేదు."

"దేవుడికి బిచ్చగాళ్ళంటే దయ వుండదా, తాతా?" అంది మళ్ళీ అమాయకంగా.

ఎలా చెప్పాలో తోచలేదు. ఉన్నదీ-లేనిదీ నిర్ధారించేటంత తెలివి తనలో లేదు. తన మౌనం ఆ పిల్ల అమాయకత్వాన్నెక్కడ గాయపరుస్తుందో నన్న భీతితో అప్పటికేదో సర్ది చెప్పేశాడు.

"దేవుడికి కాకపోతే ఇంకెవరికి వుంటుందమ్మా దయ - పేదవాళ్ళ పట్ల. ఇప్పుడు కాకపోతే రేపైనా కరుణిస్తాడు. చీకటి పడుతోంది- త్వరగా యిల్లు చేరుకో.... వెళ్ళు."

ముత్యాలు వెళ్ళిపోయిన తర్వాత 'దేవుడు రేపైనా కరుణిస్తాడా' అన్న అనుమానం ముష్టితాత మనసులో అనుమానంగానే మిగిలిపోయింది. జవాబు తనకే తెలియదు. తను వేదాంతి కాని, జ్ఞానికాని, కాక పోయినందుకు ఎంతగానో మధన పడ్డాడు అప్పుడు. మనిషికి దైవ జ్ఞాన అవసరం యేపాటిదో అప్పుడే తెలిసి వచ్చింది.

ఆ విషయాన్ని గురించే నిశి తంగా ఆలోచిస్తున్నాడు ముష్టితాత. చీకటి-చీకటి నిండిన ఆకాశంలో చుక్కలు. చుక్కల గుండెల్లోకూడా

తన కేర్పడిన సందేహమే చోటు చేసుకున్నట్లనిపించింది.

ముత్యాలు అమాయక హృదయం గాయపడరాదనే కోరుకున్నాడు ముష్టితాత. విధి విజృంభించి, పరంపరల ముసుగులో, వారసత్వాల పెనుహక్కు క్రింద అనాదిగా అనుభవిస్తున్న పేదరికం దాడి చేసింది. బ్రతుకుతెరువుకు మార్గంలేక విలవిల్లాడే పేద ఇంట్లో మందు-మాకుల వాసనైనా పీల్చ లేని చిట్టి-పొట్టి ప్రాణాలపై విధి అశనిపాతంలా మారింది. ఆ కారణంగా ముత్యాలు కాలు పోలి యోలో పనికిరాకుండా పోయింది. ఆమె కుడికాలు మాత్రమే అవిటి. కాని మనసు- అది గంగా జలం కంటే, గులాబి పువ్వుకంటే పవిత్రమైంది, అతి సున్నితమైంది.

ఆలోచనల సమరం ముగిసి ముష్టితాత తనకు తెలియకుండానే నిద్దర వాడిలోకి జారి పోయినపుడు చంద్రుడు నడి నెత్తికి చేరాడు. అతడి కను కొలుకుల్లో మూతపడ్డ రెప్పల చాటునుంచి అశ్రు బిందువులు రెండు, వెన్నెల కిరణాల వెలుగులో ప్రదీపిస్తూ కనిపించాయి.

* * *

సంధ్యా సమయం—

ముష్టితాత కొండ దిగి వచ్చాడు. పాత్ర ఖాళీగా ఉంది. నాలుగు కాసులు ఆ రోజు కొండనెక్కిన భక్తుల సంఖ్యకి చిహ్నంగా నిలిచి పోయాయి అతడి చేతిలో. క్రింద మంటపం దగ్గిర నిలిచి ముత్యాలు వైపు తదేకంగా చూస్తున్నాడు.

రోడ్డువైపు దీనంగా చూపులు పరచికూచుంది ముత్యాలు. మొహం రంగు మారి ఉంది. కళ్ళు చెమర్చను సిద్ధంగా ఉన్నాయి. కొండ మీంచి చూస్తే దూరంగా మలుపు తిరుగుతూ కనిపించే రోడ్డు చివరిదాకా ఆశగా ప్రాకి వెళ్తోంది చూపు. నిరాశగా మరలుతోంది. వెక్కిరిస్తున్నట్టు శూన్యంగా దారి, పరచిన చీకటి పరదాలా ఉంది. జనం రాక కొరకు ఎదురుచూసే చూపుల్లో శూన్యం- మరేదో ఆశాకిరణం. ఆ రెంటికీ నడుమ ఎన్నో ఆశలు.

సాయంత్రంగా వచ్చే వాకటీ-అరా జనం కొరకు ఆబగా నిరీక్షిస్తున్నాడు ముష్టితాత. నిరీక్షణ ముగిసే సరికి సంజె చీకటి బాగా ముసురు కొచ్చేసింది.

అప్పుడే మంటపానికి కొద్ది దూరంలోని ఖాళీ ప్రదేశంలో

ఆగిందో కారు. అందులోంచి దిగుతున్న జంటవైపు గబగబా నడచి వచ్చాడు ముష్టితాత.

"సత్యం! నువ్వూ రాకూడదూ?" అన్నాడు కార్లోంచి దిగిన వ్యక్తి.

"నాస్తికుడికి దైవ దర్శనం ఎందుకూ? మీరిద్దరూ వెళ్ళిరండి. నేనిక్కడే వుంటాను." సత్యం డోర్ తెరచి క్రిందికి దిగుతూ అన్నాడు.

"సరేలేవోయ్...మహానాస్తికుడివి దిగి వచ్చావు. అంతమాత్రం చేత దేవుణ్ణి దర్శిస్తే నీ నియమాలు చెడిపోవు. ఇంతదూరం కార్లో వచ్చిన వాడివి, ఇంకో నాలు గడుగులు నడిస్తే మునిగిపొయ్యేదేమీ ఉండదు. కమ్ ఐ సే!" శ్రీమతిని అనుసరిస్తూ వత్తిడి చేశాడు మిత్రుడు.

"నో...నో. ఏ ద్వాపర యుగంలోనో చనిపోయిన దేవుడి దగ్గరికి రావడం నాకిష్టంలేదు." సిగరెట్ పొగ వదులుతూ త్రోసి రానన్నాడు సత్యం.

వారిద్దరూ వెళ్ళిపోయారు.

అంతవరకూ అక్కడే నుంచుని వాళ్ళ సంభాషణంతా వింటూన్న ముష్టితాత అప్పుడు కాని నోరు మెదపలేదు.

---


# విజయ

# చందా వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | 36 రూ|| |
| అర్ధసంవత్సర చందా | 18 రూ|| |
| విడి ప్రతి | 3 రూ|| |

"బాబూ! ముసలివాణ్ణి. ఏదైనా ధర్మం ఇప్పించండి."

ముష్టితాత వైపు అదోలాగ చూస్తూ "వెళ్ళిరా" అన్నాడు సత్యం. ముష్టివాళ్ళి దేశానికి చీడ పురుగులనే భావం అతని చూపుల్లో వ్యక్తమైంది.

చాలా సేపటివరకు అతణ్ణి పరీక్షగా చూస్తూ అక్కడే నిలుచున్నాడు ముష్టితాత. ఉన్నతహోదాలో వున్న ఆఫీసర్‌లా వున్నా నిజానికి చిన్న పాపాయిలా అవుపించాడు సత్యం. అనుభవాల సముద్రంలో తరంగాల కదలిక మీద ముక్కుతో పొడిచి చేపను పట్టుకోవాలని తాపత్రయపడే పిచ్చికలా తోచాడు. చాలాకాలం అలా గమనించిన మీదట అటు వైపుగా సాగిపోతోన్న మరో జంటవైపు తిరిగి పాత్రని ముందుకు చాచాడు.

"బాబూ! ముసలివాణ్ణి... దేవుడి పేరిట ఏదైనా ధర్మం ఇప్పించండి" అన్నాడు.

పావలా కాసుపడింది పాత్రలో. అప్పుడే మరోమారు అనూహ్యంగా సత్యం వైపు చూశాడు తాత.

"చూశావా బాబూ! దేవుడు ద్వాపర యుగంలో చనిపోయినా మనిషి మనసులో శాశ్వతంగా బ్రతికే ఉన్నాడు. వాళ్ళలో దయగా రూపుదిద్దుకొని జీవిస్తున్నాడు. మరొకరికి ఉపకారం చేయలేనివాడే నిజంగా చనిపోయినవాడు." తనెందుకా మాటలు చెపుతున్నదీ ముష్టితాతకే తెలియలేదు.

సత్యం దోషిలా తల వంచుకున్నాడు.

"కనిపించకపోయినా, దేవుడు ఎందరి హృదయాలు ఆకట్టుకోగలుగుతున్నాదో చూడు. కనిపించి కూడా సాటి మనిషి దీనత్వాన్ని అర్థం చేసుకోలేక పోతున్నాడు మనిషి. దేవుడికీ, మనిషికీ అదే తేడా. అందుకే బాబూ! ఏదో ఒక రూపంలో దేవుడు బ్రతికి వుంటేనే నాలాంటి నిరాధారులు రోజుకో పిడికెడు గింజలు సంపాదించగలుగుతారు, పొట్ట పోషించుకోగలుగుతారు."

"పొట్ట పోషించుకోడానికి చేయి చాచడం ఒకటే మార్గమంటావా తాతా? కష్టించే వాడిని దేవుడు కరుణించడంటావా?"

చిన్నగా నవ్వాడు ముష్టితాత.

(మిగతా కథ 69వ పేజీలో)

సత్యం నిర్లక్ష్యంగా చూశాడు అతడివైపు.

"బాబూ! ఆ కొండ మీంచి దిగి వస్తున్న అమ్మాయిని చూడు. ఆ కుంటిపిల్ల ఏం పని చేయగలదంటావు? రాళ్ళెత్తగలదా? పొలాల్లో కూలిపని చేయగలదా? పదేండ్లక్రితం వయసు బరువు మోసుకొంటూ ఇక్కడికొచ్చేన్నేను. ఈ వయసులో 'దేహీ' అంటూ చేతులు చాచడం తప్పనిచ్చి మరేం చేయగలను? తన వెనక ముగ్గురిని పోషించాలి ముత్యాలు. ఏం చేసి పోషించగలదంటావు? దేవుడు తప్ప ఆమెకి దిక్కంటూ ఎవరున్నారు? ఆ పిల్ల రోజూ కుంటుకొంటూ 3 మైళ్ళు కాళ్ళీడ్చుకొంటూ వస్తుంది. భిక్షగాళ్ళ దేశ ఉన్నతికి అడ్డంకులనే నీతిపరులు ఆ పిల్ల జీవనోపాధికి మార్గం చూపగలిగారా!"

ముష్టితాత ప్రశ్నలకి ఉలికి పడ్డాడు సత్యం.

"బాబూ! నిన్ను చూసేక ఓ విషయం పదేపదే గుర్తుకొస్తూంది. రామాయ పాలెంలో ముత్యాలు వంటి కుంటి ఇల్లాలు వొకావిడ వుండేది. చాన్నాళ్ళ క్రిందట జరిగిన విషయం. భర్త పోయాక నాలుగేండ్ల కొడుకుని పెంచే స్తోమత లేక వీధుల్లోపడి బిచ్చమెత్తుకుంది. కొడుకు భవిష్యత్తు తీర్చి దిద్దాలని ఆరాటపడింది. తల్లి మనసుకాబట్టి, వాడి శ్రేయస్సు కొరకూ, వాణ్ణి గొప్ప గొప్ప చదువులు చదివించడం కొరకూ, ఆఊళ్ళోనే గోవింద రావు కాళ్ళమీద పడి సహాయం చేయమంటూ యాచించింది. ఆ తల్లి నిజంగా భిక్షకత్తే నంటావా బాబూ? సీతమ్మ మీద జాలి కొద్దీ, ఆమె కొడుకు చదువుల కోసం తనకున్న రెండెకరాల పొలం అమ్మేసి గోవిందరాజులు బికారీ అయ్యాడు. పూవులమ్మిన ఊర్లో ఉప్పు అమ్ముకోవడం ఇష్టంలేక ఎటో వెళ్ళిపోయాడు. ఇప్పుడతను భిక్షం ఎత్తుకొనే బ్రతుకుతున్నాడట. అతను కూడ భిక్షగాడే నంటావా?"

ఆవేశంగా చెప్పుకు పోతూన్న ముష్టితాత మొహంలోకి నిశితంగా చూశాడు-సత్యం. రెప్పల చాటు నుంచి తన్ను కొచ్చిన కన్నీళ్ళు ప్రయత్నం మీద ఆపుకొన్నాడు.

చెప్పవలసినదంతా ముగిసినట్టు, కనీసం సత్యం జవాబు కొరకు ఎదురుచూసే అవసరంకూడా తనకు

లేనట్టు, మంటపం వైపు నడచి పోతున్నాడు ముష్టితాత. ఆ నడకలో వేగం లేదు. గాలికి రెపరెపలాడే ఎండుటాకులా మనిషి సాంతం కంపిస్తున్నాడు. అతడి కాళ్ళు తడబడినా, గమ్యంవైపు ముందుకు సాగిపోతూనే ఉన్నాయి.

కారు దగ్గర నిలుచొని కళ్ళొత్తుకొన్నాడు సత్యం!

పతనానికీ, అభివృద్ధికీ నడుమ ఊగిసలాడుతోన్న దేశ భవిష్యత్తులా అగుపించింది తాతనడక సత్యానికి. ఆ రూపంలో గోవిందరావు కనిపిస్తున్నాడు. అమ్మ మరణించాక కర్మకాండను స్వయంగా పూర్తిచేసి, తను పట్నం నుంచి వచ్చేలోపుగానే వెళ్ళిపోయిన ఆ దేవుడు కనిపిస్తున్నాడు. అతడి అణువణువులో దాగి తృప్తిగా తనని పరికిస్తున్న అమ్మ కనిపిస్తోంది.

అతడు గోవిందరావుకాడూ? దేవుడు తాత కాదూ? -అతనే గనక దేవుడు తాత అయివుంటే తనను గుర్తించలేక పోయాడా?

"అయ్యా! దేవుడి పేరిట ఏదైనా ధర్మం యిప్పించండి. కుంటి పిల్లను..మీకు పుణ్యం వుంటుంది, బాబూ!"

ఆలోచనల్లోంచి తేరుకొని చూశాడు సత్యం. ఎదుట ముత్యాలు నిలిచి ఉంది. చంకలో బిగించిన ఊతకర్ర ఆమె బరువునంతా మోయలేక సన్నగా కంపిస్తూ కనిపించింది. కళ్ళు ఆశ నింపుకొని ఆబగా చూస్తున్నాయి.

అతడు ముత్యాలు వంక జాలిగా చూశాడు. దూరంగా మంటపం దగ్గరికి చేరు కొంటోన్న ముష్టితాత వైపు చూశాడు తర్వాత.

పర్సులోంచి అయిదు రూపాయల కాగితం బైటికిలాగి "అమ్మీ! నాకో సహాయం చేసి పెట్టాలి. చేయగలవా?" అన్నాడు.

ప్రశ్నార్థకంగా చూపింది ముత్యాలు.

"అదిగో....ఆ మంటపం దగ్గరున్నాడు చూశావూ....ఆయనకో మాట చెబుతావా?"

అతణ్ణీ, ముష్టితాతనీ మార్చి, మార్చి చూపింది ముత్యాలు-ఏదీ అర్థంకాక. ఆవిడ అసమంజసాన్ని చూసి చిన్నగా నవ్వుకొన్నాడు సత్యం.

"దేవుడు తాత చావకూడదు!" అన్నాడు చివర్లో.

ఆ సందేశం ముత్యాలు ముష్టి తాతకు అందించే లోపుగానే సత్యం కారు కదిలి, దూరాన కనిపించే మలుపు తిరిగిపోయింది! *